క్లుప్తంగా

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూపాయల్లో.. టమాట 15, నల్ల వంకాయ 26, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 50, క్యాబేజీ 9, క్యారెట్ 20, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 19, కందగడ్డ 33, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. కాగా ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

కీసరకు ప్రత్యేక బస్సులు

కంటోన్మెంట్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జేబీఎస్ నుంచి కీసర వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రామ్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. జేబీఎస్ నుంచి కీసర వరకు ప్రయాణికులకు ఒక్కరికి రూ.60 చొప్పున చార్జీ ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు



క్రీడల వివరాలు వెల్లడిస్తున్న నరేంద్ర క్రిష్ణ

రసూల్‌పురా: స్వామి వివేకానంద జయంత్యుత్సవాలను పురస్కరించుకుని భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో క్రీడా భారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీలను శుక్రవారం నుంచి సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జింఖానా మైదానంలో వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరేంద్ర క్రిష్ణ మాట్లాడుతూ.. భారత వికాస్ పరిషత్ రాజకీయేతర, సామాజిక, సాంస్కృతిక స్వచ్ఛంద సంస్థ అని ప్రతి రెండేళ్లకోసారి పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. నేటి నుంచి మూడ్రోజుల పాటు ఖోఖో, షాట్‌పుట్, కబడ్డీ, అథ్లెటిక్స్ విభాగంలో 100, 200, 400 మీటర్ల రిలే పరుగు పందెం నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ముగింపు వేడుకలకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరవుతున్నారని, విజేతలకు ఈ నెల 11న హరిహర కళాభవన్‌లో బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి ఈడీ నాగరాజు, కోశాధికారి శివరామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రఘు, సతీష్ కుమార్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఎంట్రన్స్ తప్పిదాలపై విచారణకు డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ పరీక్షలు, ఫలితాలు, అర్హత మార్కులు తదితర అంశాల్లో జరిగిన తప్పిదాలపై రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు విచారణ చేపట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు గురువారం డిమాండ్ చేశారు. యూజీసీ మార్గ దర్శకాలను తుంగలో తొక్కి 50 శాతం రీసెర్చ్ మెథడాలజీ సబ్జెక్టుపై ప్రశ్నలు లేకుండా ఓయూ ప్రవేశ పరీక్షలను తప్పుగా నిర్వహించి విద్యార్థులకు అన్యాయం చేశారని వివరించారు. తప్పిదాలపై విచారణ జరిపి రీసెర్చ్ మెథడాలజీకి 35 వెయిటేజీ మార్కులు ఇవ్వాలన్నారు. రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీల రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ఆధారంగా కటాఫ్ మార్కులు లేకుండా అందరిని ఇంటర్వ్యూలకు పిలవాలన్నారు.

కేయూ అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టర్ మల్లేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్‌కు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఓయూ జర్నలిజం విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో సుపరిపాలనలో మీడియా పాత్ర, ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. గతంలో కేయూ ప్రభుత్వ పాలన శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీ అందుకున్న ఆయనకు ఇది రెండో పీహెచ్‌డీ. ప్రస్తుతం కేయూ జర్నలిజం విభాగం హెడ్‌గా కొనసాగుతున్న డాక్టర్ మల్లేశ్వర్ పూలే, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా జేఏసీలో చురుకైన పాత్ర పోషించిన బీసీ నేతగా సుపరిచితుడు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గణేశ్ మృతదేహం

సికింద్రాబాద్: వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టిన ప్రమాదంలో పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చెట్లతిమ్మాయపల్లికి చెందిన మాలోతు గణేశ్(48) చర్లపల్లిలోని ఒక కంపెనీలో ప్రైవేటు ఉద్యోగి. విధులకు హాజరయ్యేందుకు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న గణేశ్ పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కమల, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రెండు భారీ ప్రాజెక్టులతో..
పాటిగడ్డకు మహర్దశ

- చకచకా సాగుతోన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు
- రూ.6 కోట్ల అంచనాతో 20 పడకల ప్రసూతి ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొనసాగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు



ప్రసూతి ఆస్పత్రి నిర్మాణం జరిగే మోడల్ మార్కెట్ ప్రాంతం

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డకు మహర్దశ పట్టనుంది. రెండు భారీ ప్రాజెక్టుల రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటికే ఒక ప్రాజెక్టు పట్టాలెక్కగా.. మరో ప్రాజెక్టు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ పడింది. నిరుపేదల శుభకార్యాలకు ప్రైవేటు ఫంక్షన్ హాల్ తలదన్నే రీతిలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. ఇక 20 పడకల ప్రసూతి ఆస్పత్రి నిర్మాణానికి దాదాపుగా గ్రీన్ సిగ్నల్ పడినట్లే. ఈ రెండు ప్రాజెక్టులతో పాటిగడ్డ ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు రానుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఫంక్షన్ హాల్ నిర్మాణంతో స్థానిక పేదలకు ఎంతో మేలు..

బేగంపేట పాటిగడ్డ కమ్యూనిటీ హాల్ ఉన్న స్థలంలో రూ.5.9 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను గతేడాది క్రితం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది. గత నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభం కాగా ఇప్పటికే గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్‌ల నిర్మాణం కూడా పూర్తి చేసుకుంది. మరో అంతస్తు నిర్మాణానికి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 12,780 చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్-2గా దీనిని నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను పూర్తిగా పార్కింగ్‌కు కేటాయిస్తుండగా, మొదటి అంతస్తులో డైనింగ్, రెండో అంతస్తులో శుభకార్యాలను నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. శుభకార్యాల సమయంలో ఒకేసారి వెయ్యి మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో ఫ్లోర్‌లో 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. భవనానికి రెండు లిఫ్టులతో పాటు మరో రెండు మెట్ల వరుసలు అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 34 పిల్లర్లతో భవన సామర్థ్యాన్ని పెంచేలా పనులు సాగిస్తున్నారు. ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణం అందుబాటులోకి వస్తే వేలకు వేలు చెల్లించి ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పేద, మధ్యతరగతి వర్గాలు నామమాత్రపు ఫీజుతో శుభకార్యాలను చేసుకునే అవకాశం దొరుకుతుంది.

20 పడకల ప్రసూతి ఆస్పత్రికి గ్రీన్ సిగ్నల్..

బేగంపేట పాటిగడ్డ మోడల్ మార్కెట్ ఆవరణలోని ఖాళీ స్థలంలో 20 పడకల ప్రసూతి ఆస్పత్రి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇటీవల మంత్రి హరీష్‌రావు ఈ స్థల పరిశీలన జరిపేందుకు రావాల్సి ఉండగా చివరి నిమిషంలో ఆ కార్యక్రమం వాయిదా పడిన విషయం విదితమే. గత రెండు నెలల క్రితం మోడల్ మార్కెట్ వెనుకన ఉన్న యూపీహెచ్‌సీని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సందర్శించిన సమయంలో ఇక్కడ ప్రసూతి ఆస్పత్రిని నిర్మించాలని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ఆ మేరకు 20 పడకల ప్రసూతి ఆస్పత్రిని నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆరు కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా రూపొందించారు. ప్రసూతి ఆస్పత్రి ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల గర్భిణులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చెంతనే ప్రసవాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఈ ఆస్పత్రి నిర్మాణం ద్వారానైనా ఎప్పుడో నిర్మించిన మోడల్ మార్కెట్‌కు మంచి రోజులు వస్తాయేమోనని పలువురు భావిస్తున్నారు.

“ మంత్రి చొరవతోనే భారీ ప్రాజెక్టులు



బేగంపేట పాటిగడ్డలో అన్ని రకాల వసతులు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ఇక్కడ నివాసముండే పేద, మధ్య తరగతి వర్గాల కోసం కనీవినీ ఎరుగని రీతిలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరుగుతుంది. అలాగే ప్రసూతి ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఇక్కడ గర్భిణులకు వ్యయ, ప్రయాసాలు తగ్గుతాయి. ఈ భారీ ప్రాజెక్టులను పాటిగడ్డలో చేపట్టడం పట్ల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు డివిజన్ ప్రజల తరుపున కృతజ్ఞతలు.

– మహేశ్వరిశ్రీహరి, కార్పొరేటర్

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



సమావేశం నిర్వహిస్తున్న డీసీ దశరథ్

సికింద్రాబాద్: పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరుగుతున్న కసరత్తుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ టి.దశరథ్ కోరారు. ప్రస్తుతం ఫొటో సిమిలారిటీస్ తొలగింపు కోసం జరుగుతున్న పరిశీలనలకు సంబంధించి జీహెచ్ఎంసీ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిప్యూటీ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో గుర్తించిన ఫొటో సిమిలారిటీస్ (ఒకే ఫొటో వేర్వేరు పేర్లతో ఉన్న) జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన అందించారు. వీటన్నింటిని పరిశీలించి అసలైన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చే ప్రక్రియను ప్రారంభించినట్లు డిప్యూటీ కమిషనర్ చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి భుజేందర్, నాయకులు రాజసుందర్(బీఆర్ఎస్), ప్రకాశ్‌గౌడ్(బీజేపీ), వల్లారపు శ్రీనివాస్(టీడీపీ), ప్రవీణ్ (కాంగ్రెస్), నరసింగరావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని నాగ లింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో మేళతాళాలు, భాజాభజంత్రీలు, రుత్వికుల మంత్రోచ్చరణ మధ్య గురువారం యాగంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు చేపట్టిన ఈ వేడుకలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి మూలవిరాట్, ఎదురుగా నంది విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు సాయిబాబా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నర్సింగరావు, గిరిధర్‌బాబు, రమేష్, గాంధీ, రాధకృష్ణశర్మ, రవి, స్వరూపరాణి, చంద్రకళ, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు, అర్చకులు ఫణిశర్మ తదితరులు ఉన్నారు.

అధిక మోతాదు యాంటీ బయోటిక్స్‌తో అనర్థం

గాంధీ సూపరింటెండెంట్ రాజారావు



ఇన్ఫెక్షన్ల నియంత్రణ కమిటీ సమావేశ దృశ్యం

గాంధీఆస్పత్రి: అధిక మోతాదులో యాంటిబయోటిక్స్ మందుల వాడకంతో పలు రకాల అస్వస్థతలు, రుగ్మతలకు గురయ్యే అవకాశం ఉందని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు స్పష్టం చేశారు. గాంధీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం జరిగిన హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కమిటీ(హెచ్ఐసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటు వ్యాధుల నియంత్రణ, నివారణతో రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూరే అవకాశం ఉందన్నారు. అధిక మోతాదు యాంటిబయోటిక్స్ వాడకంతో సైడ్‌ఎఫెక్ట్స్‌తో పాటు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హాస్పిటల్ యాంటిబయోటిక్స్ మేనేజ్‌మెంట్ పాలసీని వైద్యులంతా తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ఆపరేషన్ థియేటర్ల బయట స్క్రబ్ సూట్లు వేసుకుని తిరగడాన్ని నిషేధించినట్లు సూపరింటెండెంట్ రాజారావు స్పష్టం చేశారు. అనంతరం బయోమెడికల్ వ్యర్థాలు వేరుచేయడం, హెపటైటిస్-బీ వ్యాక్సినేషన్, అన్‌క్లియర్ ఏరియాస్, సిబ్బంది పనితీరు, కార్డియోథొరాసిస్, ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్లలో హెల్త్‌కేర్ వర్కర్స్‌కు ఎమ్మార్ఎస్ఏ స్క్రీనింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఇన్ఫెక్షన్ల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గాంధీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయోలజీ విభాగాలు సంయుక్తంగా రూపొందించిన హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్ఎంఓ-1 జయకృష్ణలతో పాటు ఆయా విభాగాధికారులు, ఆర్ఎంఓలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: మరమ్మతుల కారణంగా సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్ఎస్పీడీసీఎల్ సీబీడీ సికింద్రాబాద్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వారాసీగూడ ఫీడర్ పరిధిలోని టీఆర్టీ క్వార్టర్స్, కుట్టివెల్లోడి, ఎస్‌బీహెచ్ శివాజీ విగ్రహం, సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రామాలయం ఫీడర్ పరిధిలోని వాటర్ ట్యాంక్, నామాలగుండు మెయిన్ రోడ్డు, శివాజీ విగ్రహం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, శ్రీనివాస నగర్ ఫీడర్ పరిధిలోని మార్కండేయ నగర్, ఫ్రైడే మార్కెట్, ఎస్ఆర్ ఆస్పత్రి, రాఘవ గార్డెన్, ఉప్పర్‌బస్తీ, బాపనబస్తీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు, నామాలగుండు, వెంకటేశ్వర దేవాలయం, పద్మగ్యాస్, అన్నానగర్, కిందిబస్తీ, నెహ్రూనగర్ హైస్కూల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రొ.రామిరెడ్డి చిత్రపటం ఏర్పాటుకు డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రం కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జి.రామిరెడ్డి నిలువెత్తు చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థులు డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డిని కోరారు. ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్‌గా పని చేసిన ఆయన ఉన్నత విద్య వ్యాప్తి, అభివృద్ధికి అనేక సేవలందించి ఓయూ గౌరవ డాక్టరేట్ అందుకున్న ప్రొ.రామిరెడ్డి దూరవిద్య కేంద్రాన్ని స్థాపించారన్నారు. అంతటి గొప్ప వ్యక్తి నిలువెత్తు చిత్రం పటం దూరవిద్య కేంద్రంలో లేకపోవడం విచారకరమన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



ప్రయాణికురాలి బంధువుకు నగదు అప్పగిస్తున్న రైల్వే పోలీసు

సికింద్రాబాద్: ఓ ప్రయాణికురాలు రైల్వేస్టేషన్‌లో మరిచిపోయిన పర్సును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తిరిగి అప్పగించారు. రిసాలబజార్‌కు చెందిన సింగిశెట్టి కళమ్మ బొల్లారం రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు టికెట్ తీసుకుని సికింద్రాబాద్ స్టేషన్‌లోని జనరల్ టికెట్ మెషీన్ వద్దకు వచ్చింది. టికెట్ తీసుకున్న కళమ్మ అక్కడే తన పర్సును మరిచిపోయి బొల్లారం వెళ్లిపోయింది. కళమ్మ మరిచిపోయిన పర్సును, అందులోని రూ.10వేల నగదును రైల్వే పోలీసులు తమ వద్ద పెట్టుకున్నారు. తిరిగి ఆమె బంధువులు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సందర్భంలో పర్సును, నగదును అప్పగించారు.

మహా శివరాత్రికి ఆలయాల వద్ద సదుపాయాలు కల్పించండి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 18వ తేదీన రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని దేవాలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డివిజన్ బీఆర్ఎస్ నాయకులు జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి ఆయా దేవాలయాల వద్ద ఏర్పాటు చేయాల్సిన వాటి గురించి వివరించారు. రాత్రంగా జాగారం ఉంటున్న దృష్ట్యా అన్ని దేవాలయాల వద్ద ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, మహ్మద్ యాసిన్, జగదీశ్వర్, గౌరిశంకర్, చందు, కిషోర్ తదితరులు ఉన్నారు.

అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు



పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: అంతర్గత రహదారుల అభివృద్ధిలో భాగంగా అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. మోడల్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, మోడల్‌కాలనీ ప్రతినిధులు బుచ్చిబాబు, సాయిప్రశాంత్, ఆనంద స్వరూప్, కృష్ణప్రసాద్, సుబ్బారెడ్డి, నాగమణి, లక్ష్మీ, నాయకులు రాజేష్ ముదిరాజ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

‘ఇప్పటి వరకు పది వేల మందికి కంటి పరీక్షలు’



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలో పది వేల మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్ఖాన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో నూతనంగా ఏర్పాటైన కంటి వెలుగు కేంద్రాన్ని రాజశేఖర్‌రెడ్డి బోర్డు మాజీ సభ్యులు బి.ప్రభాకర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 7 కంటి వెలుగు కేంద్రాల ద్వారా 7 వేల మందికి పైగా కంటి అద్దాలు అందజేశామని, అతి తక్కువ మందికి శస్త్ర చికిత్స అవసరమైందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజకుమార్, మెడికల్ ఆఫీసర్ డా.కార్తీక్, కంటి వెలుగు కేంద్రం డాక్టర్ కార్తీక, ఆశ వర్కర్లు, ఉమారాణి, రాధ, కవిత, రమ్య, సంధ్య, రజిని, అంబిక, అగ్రీస్, అప్తామాలజిస్ట్ చిరంజీవి, స్థానిక నాయకులు అక్తర్, అహ్మద్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమీర్‌పేట: బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూలు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు టాపర్లకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకలో స్కూల్ నిర్వాహకులు, రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, టి.జయ్‌గుప్తా, మురళీధర్‌రెడ్డి, హిందులతరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు




గ్యార్వీ వేడుకల్లో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లో గురువారం రాత్రి గ్యార్వీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొనగా ముస్లింలతో కలిసి షేక్ అబ్దుల్లా ఖాదిర్ జిలానీ స్మారకార్థం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు జునైద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, వంజరి వెంకటేష్, నాగులు, ఖాజా తదితరులు ఉన్నారు.

రోడ్ల మూసివేతపై స్పష్టత వచ్చేనా?

- నేడు బోర్డు సమావేశం
- టోల్ వసూళ్ల కొనసాగింపుపై చర్చించే అవకాశం



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కమిటీ ఏర్పాటైన తర్వాత తొలి బోర్డు సమావేశం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్ నేతృత్వంలో జరగనుంది. ఈ సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడితో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సాయన్నలు పాల్గొంటారు. కంటోన్మెంట్‌లో రోడ్ల మూసివేతపై ఇటీవల స్థానికంగా ఆందోళనలు తీవ్రతరం అయిన నేపథ్యంలో ఈ అంశంపై బోర్డు కీలక నిర్ణయం తీసుకోనుంది. దీంతో పాటు గత నవంబర్ నుంచే టోల్ ట్యాక్స్ వసూళ్లు నిలిపివేస్తామంటూ తీర్మానించిన బోర్డు, గెజిట్ విడుదల కాలేదన్న సాకుతో మళ్లీ యథావిధిగా వసూళ్లు కొనసాగిస్తోంది. దీనిపై కూడా బోర్డులో చర్చించనున్నారు. ఈ మేరకు ఎజెండాలో చేర్చిన పలు అంశాలపై చర్చించే అవకాశముంది.

- ఇదిలా ఉండగా కంటోన్మెంట్‌కు స్థానిక మిలటరీ అధికారులు చెల్లించాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు రూ.750 కోట్లు దాటాయి. కనీసం రూ.100 కోట్లు అయినా ఇవ్వాలంటూ గత కొన్ని సమావేశాల నుంచి ఎమ్మెల్యే సాయన్న డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ సారి సర్వీసు చార్జీల విషయంలో ఆయన పట్టుబట్టే అవకాశముంది.

10 శాతం పేచీ...

- ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భాగంగా కేంద్రం కంటోన్మెంట్‌లోనూ టోల్ ట్యాక్స్ ఎత్తివేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే బోర్డు ప్రధాన ఆదాయ మార్గాల్లో ఒకటైన టోల్‌ట్యాక్స్ ఎత్తివేస్తే ప్రత్యామ్నాయంగా నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి గెజిట్ వెలువడేంత వరకు వసూళ్లు చేసుకునేలా కాంట్రాక్టర్‌కు వెసులుబాటు కల్పించింది. ఇందు కోసం ప్రతీ నెలా 10 శాతం అధిక మొత్తంలో చెల్లించాలని సూచించింది. దీనిపై కాంట్రాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే సమయంలో టోల్ ట్యాక్స్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై జరిమానా విధించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ రెండు అంశాలపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

రోడ్ల మూసివేత..

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఏవేని రోడ్లను మూసివేయాలంటే బోర్డు తీర్మానం తప్పనిసరి. అయితే ఇటీవల కొన్ని రోడ్లను శాశ్వతంగా మూసి వేస్తున్నట్లు బోర్డు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో రోడ్ల మూసివేత, అభ్యంతరాలపై శుక్రవారం నాటి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ప్రధానంగా...

- సికింద్రాబాద్ మిలటరీ స్టేషన్ డిప్యూటీ కమాండర్‌గా వ్యవహరించే బ్రిగేడియర్ సోమశంకర్, బోర్డు అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు.
- కంటోన్మెంట్ బోర్డుకు స్థానిక మిలటరీ అథారిటీస్ నుంచి రూ.750 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది.
- ఇతర సంస్థల నుంచి బకాయిలు రాబట్టేందుకు బోర్డు కఠినంగానే వ్యవహరించింది. అదే స్థాయిలో వసూళ్లు కూడా చేసింది. అయితే ఇక్కడ బకాయిలు చెల్లించాల్సిన ఆర్మీకి ప్రాతినిధ్యం వహించే అధికారే వసూలు చేయాల్సిన బోర్డుకూ అధ్యక్షత వహిస్తున్నారు. దీంతో సర్వీసు చార్జీల విషయంలో బోర్డు అధికారులు కానీ, బోర్డు సభ్యులు కానీ గట్టిగా నిలదీయలేని పరిస్థితులు ఉన్నాయి.
- అయితే ఎమ్మెల్యే సాయన్న మాత్రం ప్రతీ సారీ సర్వీసు చార్జీల బకాయిల అంశాన్ని లేవనెత్తుతూ తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.
- త్వరలోనే ఎంతో కొంత బకాయిలు వచ్చే అవకాశముందంటూ గత బోర్డు సమావేశంలో బ్రిగేడియర్ హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.